దూరాభారం..!

- బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్న రైతులు
- పెదవాల్తేరు రైతుబజార్ వ్యాపారుల దీనస్థితి
- ఆటోలు, వ్యాన్లకు అధిక చార్జీలు చెల్లించి బజారుకు కూరగాయలు తీసుకొస్తున్న వైనం
- పట్టించుకోని మార్కెటింగ్, ఆర్టీసీ అధికారులు


ఆర్టీసీ బస్సు(ఫైల్)


పెదవాల్తేరు రైతుబజార్

బీచ్‌రోడ్డు: నగరం నడిబొడ్డున గల పెదవాల్తేరు రైతుబజార్ రైతులు బస్సు సదుపాయం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. నగరంలోని సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, మద్రిపాలెం తదితర రైతుబజార్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. దీంతో రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను బజార్లకు తీసుకొచ్చి విక్రయించేందుకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. పెదవాల్తేరు రైతుబజార్ పరిస్థితి మాత్రం అధ్వానంగా తయారైంది. బస్సు సదుపాయం లేకపోవడంతో రైతులు అధిక చార్జీలు చెల్లించి ఆటోలు, ఇతర వాహనాల ద్వారా కూరగాయలను ఇక్కడికి తీసుకొస్తున్నారు. కొన్ని సార్లు ఉదయాన్ని ఆటోలు అందుబాటులో ఉండకపోవడంతో రైతుబజార్‌కు చేరుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బజారుకు రైతులు వచ్చే సరికే మార్కెట్ కూడా ఖాళీ కావడంతో తీసుకొచ్చిన కూరగాయలు అమ్ముకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

దూర ప్రాంతాల నుంచి రైతుల రాక

ఈ రైతుబజార్‌లో మొత్తం 75 స్టాళ్లు ఉండగా.. 114 మంది రైతులు పలు రకాల కూరగాయలు విక్రయిస్తున్నారు. ఆనందపురం, కె.కోటపాడు, భీమిలి, పెందుర్తి, సబ్బవరం, రావికమతం, డుంబ్రిగుడ తదితర మండలాలకు చెందిన రైతులు రైతుబజార్‌కు కూరగాయలు తెచ్చి వ్యాపారాలు సాగిస్తుంటారు. బస్సు అందుబాటులో లేని కారణంగా ఆటోలు, వ్యాన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి వీరిది. ఫలితంగా అధిక చార్జీలు భరించాల్సిన వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇక్కడ సాయంత్రం వేళ కూడా బజార్ నిర్వహించడం తెలిసిందే. దీంతో రైతులు రెండో పూట కూడా వ్యాపారాలు సాగిస్తున్నారు. బస్సు సదుపాయం అందుబాటులో ఉంటే ఎంతో మేలు జరిగేదని రైతులు చెబుతున్నారు.

మొదట్లో బస్సు సదుపాయం

పెదవాల్తేరు రైతుబజార్‌కు మొదట్లో బస్సు సదుపాయం ఉండేది. అనివార్య కారణాల వల్ల 2007లో ఈ బజార్‌ను మూసివేశారు. 2008లో రైతుబజార్‌ను పునరుద్ధరించినా.. బస్ సదుపాయాన్ని మాత్రం మర్చిపోయారు. 16 ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ ఆర్టీసీ బస్సు సదుపాయం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బస్సు అందుబాటులో ఉంటే సురక్షిత ప్రయాణం చేసేవారమని, ఆటోలు, వ్యాన్లలో ప్రయాణిస్తున్న కారణంగా ఎప్పుడు ప్రమాదాలకు గురవుతామోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటు మార్కెటింగ్ శాఖ.. అటు ఆర్టీసీ అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పట్టించుకునే వారేరి..?

పెదవాల్తేరు రైతుబజారుకు 16 ఏళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా.. మార్కెటింగ్ శాఖ అధికారులు గాని, ఆర్టీసీ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ఎన్ని సార్లు రైతులు తమ సమస్యలను మార్కెటింగ్ అధికారులకు చెప్పుకున్న ఎటువంటి స్పందన లేదని వాపోతున్నారు. అన్ని రైతుబజార్లకు ఉన్నట్లే తమకు కూడా బస్సు సదుపాయం కల్పించాలని రైతులంతా కోరుతున్నారు.

బస్సు లేక అవస్థలు



పెదవాల్తేరు రైతుబజార్‌కు బస్సు సదుపాయం లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. దూర ప్రాంతాల నుంచి ఆటోలు, వ్యాన్లలో చేరుకోవాల్సి వస్తోంది. ఆటోలో మూటకు రూ.50 వంతున చార్జీలు భరించి వస్తున్నాం. అధికారులు వెంటనే బస్సు సదుపాయం కల్పించాలి.

– విజయలక్ష్మి, రైతు, పద్మనాభం

ఆటోలో రావాల్సి వస్తోంది



రైతుబజార్‌కు బస్సు లేక ఇబ్బందిగా ఉంది. తాను ఎంవీపీ కాలనీ రైతుబజార్ వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి ఆటోలో బజారుకు వస్తున్నాను. ఫలితంగా బస్సు, ఆటో కలిపి రోజుకు రూ.80 వరకు ఖర్చవుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సన్యాసమ్మ, రైతు, కె.కోటపాడు

ఆకుకూరలు పాడవుతున్నాయి



మేము ఆకుకూరలు బజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. బస్సు సదుపాయం లేక ఆటోలు, వ్యాన్లలో తెచ్చే సరికి చాలా సమయం పడుతోంది. దీంతో ఆకుకూరలు పాడవుతున్నాయి. బస్సు ఉంటే ఉదయాన్ని బజారుకు వచ్చి తాజా సరకు అమ్ముకునే అవకాశముంటుంది.

– కృష్ణ, రైతు, చింతల అగ్రహారం

ఐఎన్‌ఎస్ కల్వరికి కొత్త రూపు


కొత్త రంగులతో ఐఎన్‌ఎస్ కల్వరి


రంగులు వేయడంతో మెరుస్తున్న టార్పెడో, ఇతర పరికరాలు

సాక్షి ఎఫెక్ట్..

ఏయూక్యాంపస్: దేశ మొదటి జలాంతర్గామి ఐఎన్‌ఎస్ కల్వరి కొత్త అందాలతో కనువిందు చేస్తోంది. ప్రజల్లో స్ఫూర్తి నింపే విధంగా ఐఎన్‌ఎస్ కల్వరి చివరి భాగాన్ని బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియం బయట సందర్శనార్థం ఉంచిన విషయం తెలిసిందే. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయకపోవడం, రంగులు లేక నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన విషయంపై 'కళతప్పిన ఐఎస్ఎస్ కల్వరి' అనే శీర్షికన ఈ నెల 13న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు వెంటనే కల్వరి భాగం, టార్పెడో, ఇతర పరికరాలకు రంగులు వేయించారు. దీని చుట్టూ ఉన్న పరిసరాలను సైతం శుభ్రం చేశారు. దీంతో సందర్శకులు ఇక్కడికి వచ్చి ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. వివిధ పాఠశాలల చిన్నారులు ఇక్కడ చేరి సందడి చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సందడి


సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ, పీజీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 1994–2024 మధ్య కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసిన పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముఖ్య అతిథి కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయ రవీంద్ర మాట్లాడుతూ సమత కళాశాలలో విద్యనభ్యసించి అనేక మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడటం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులంతా ప్రస్తుత విద్యార్థులకు ఆదర్శంగా, సహకారంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూర్వ విద్యార్థులు సందడి చేశారు. పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యాపక విలువలకు తార్కాణం విశ్వేశ్వరరావు


విశ్వేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అపుస్మా, ఏపీటీసీఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ట్యూటోరియల్ కాన్వెంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, రోజరీ కాన్వెంట్ వ్యవస్థాపకుడు, కరస్పాండెంట్ నెమ్మారు విశ్వేశ్వరరావు అధ్యాపక విలువలకు తార్కాణమని ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 1న మరణించిన విశ్వేశ్వరరావు సంతాప సభ ఆదివారం పాతవెంకోజీపాలెంలోని రోజరీ కాన్వెంట్ స్కూల్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూర్వ విద్యార్థులందరూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అపుస్మా రాష్ట్ర కోశాధికారి ఎం.వి.రావు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి విశ్వేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. రోజరీ కాన్వెంట్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రామస్వామి మాట్లాడుతూ పాఠశాల స్థాపించి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపిన ఘనత విశ్వేశ్వరరావుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఏసీ ప్రతినిధులు చౌదరి, సత్యనారాయణ, భారతి స్కూల్ ప్రతినిధి మణికుమార్, సరస్వతి స్కూల్ ప్రతినిధులు శ్రీనివాస్, శాంతా శ్రీనివాస్, వాగ్దేవి స్కూల్ ప్రతినిధి సత్యనారాయణ, ప్రకాష్ స్కూల్ ప్రతినిధి మురళీ, విశ్వేశ్వరరావు కుమారుడు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


కాంగ్రెస్ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

ఏయూక్యాంపస్: ఎన్నికల మ్యానిఫెస్టో అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సూచించాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. కిర్లంపూడి లేఅవుట్‌లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.ఎ.నారాయణరావు నివాసంలో ఆదివారం పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజల కష్టాలు, వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదం మహేష్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు డోలా శ్రీనివాసరావు, జమ్ము ఆదినారాయణ్, మూల లేపాక్షి, జగన్, మూల వెంకటరావు, గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

మద్దిలపాలెం: ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయాలను ప్రత్యేక పూజలకు సిద్ధం చేశారు. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస వ్రతం(నెలగంట)తో ఉత్సవాలు ప్రారంభమై.. వచ్చే జనవరి 18 వరకు కొనసాగుతాయి. జనవరి 10న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శనంతో పాటు గోదా అమ్మవారి అభిషేకం, తోమాల సేవ కార్యక్రమాలు జరుగుతాయి. 11న కుడారై ఉత్సవం, 13న గోదా అమ్మవారి కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతి శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

- కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ముస్తాబుతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు.

అప్పన్న అన్నదానానికి విరాళాలు


దాతలకు బాండ్‌లు అందిస్తున్న దేవస్థాన సిబ్బంది

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరానికి చెందిన శిరీష్, కాళ్ల పురుషోత్తం అనే దాతలు చెరో రూ.లక్ష చొప్పున విరాళాలు అందించారు. సంబంధిత విరాళాలను సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో సిబ్బందికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు


కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం(జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నగరానికి చెందిన నటరాజ నృత్యాలయంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా కూచిపూడి నృత్యం ప్రదర్శించి అలరించారు. కళాకారులు హాసిని, మోక్షిత, గున్విక,చిన్మయి, సౌజన్య, గామిని, సాన్వి, యశ్విత, నక్షత్ర,లిఖిత, దీపిక,నిత్యశ్రీ తదితర కళాకారులు పాల్గొనగా బి. అన్నపూర్ణ నృత్య దర్శకత్వం వహించారు.

జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలోని సునీల్‌శర్మ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదివారం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, బోధన తీరు, వసతులు తదితర విషయాలు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు బోధనాంశాలు ఏ మేరకు అర్థమవుతున్నాయో ప్రశ్నలు వేసి పరీక్షించారు. ముఖ్యంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలులో భాగంగా గణితంలో విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు విని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో కచ్చితంగా శత శాతం ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రధానోపాధ్యాయిని కె.గీతాదేవి, గణిత ఉపాధ్యాయురాలు యు.నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు పొట్టి శ్రీరాములు

- అమరజీవి వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

ఆరిలోవ: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడని అనకాపల్లి జిల్లా డీఎస్పీ పి.నాగేశ్వరరావు కొనియాడారు. విశాలాక్షినగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పోలీస్ అధికారులతో కలిసి డీఎస్పీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం శ్రీరాములు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీడీ సత్యపద్మ, ఉద్యోగులు

అమరజీవి సేవలు చిరస్మరణీయం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో పొట్టి శ్రీరాములుకు ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. అమరజీవి చిత్రపటానికి ఈడీ సత్యపద్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. భావితరాలు ఆయన సేవలను స్మరించుకోవాలని కోరారు.

- ఎంవీపీ కాలనీ శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. తెలుగువారికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. అధ్యాపకుడు సూర్యప్రకాష్, రచయిత సుసర్ల సర్వేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆరిలోవలో రెవెన్యూ సదస్సు

ఆరిలోవ: ఆరిలోవ, ముడసర్లోవ ప్రాంతాలకు చెందిన ప్రజల కోసం సోమవారం రెవెన్యూ సదస్సు జరగనుంది. జీవీఎంసీ 12, 13 వార్డులకు సంబంధించి ఆరిలోవ టీఐసీ పాయింట్ సమీపాన ఆంధ్రా బ్యాంక్(హిందీ కాలేజీ) రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సు జరుగుతుందన్నారు. రెవెన్యూ సమస్యలపై అధికారులకు స్థానిక ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

మెడికల్ టూరిజానికి విశాఖ అనువైన వేదిక

- డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ సూర్యప్రకాశరావు


మాట్లాడుతున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ సూర్య ప్రకాశరావు

ఏయూక్యాంపస్: మెడికల్ టూరిజంనకు రాష్ట్రంలో విశాఖ నగరం అనువైన వేదిక అని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అభిప్రాయపడ్డారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన మాక్ సంస్థ తొలి వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. సౌందర్యం వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, దీనిని పెంపొందించే దిశగా కాస్మటాలజీ రంగం విస్తరిస్తోందన్నారు. పైడా విద్య సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మాక్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో విస్తరించడం కాస్మటాలజీ రంగం అభివృద్ధికి నిదర్శనమని, రెండు వందలకు పైగా చికిత్సలు అందించడం విశేషంగా పేర్కొన్నారు. ఆడారి కిశోర్ కుమార్ మాట్లాడుతూ మాక్ సంస్థ సేవలు విశాఖలో ప్రారంభమై.. విదేశాలకు విస్తరించడం గొప్ప విజయమన్నారు. యూబీఐ రీజినల్ మేనేజర్ నరసింహకుమార్ మాట్లాడుతూ, ఇటువంటి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్నారు. సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ శ్రీ వల్లి కొర్రపాటి మాట్లాడుతూ ఐదంకెల జీతం వదులుకుని.. పారిశ్రామికవేత్తగా రాణించాలని ఈ రంగంలోకి వచ్చానన్నారు. నారీశక్తి లోన్ పొంది సంస్థను ప్రారంభించిన సందర్భాన్ని వివరించారు. మైనా ఏస్తటిక్స్‌గా యు.కె., అమెరికాలో సేవలు ప్రారంభించామన్నారు. మన దేశంలో 40 ఫ్రాంచైజీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అకాడమీ ప్రారంభించి నిరుద్యోగ యువతకు శిక్షణ అందించి.. ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు.

కూటి కోసం కోటి విద్యలు

- డోలక్‌లు, ఢమరుకాల తయారీ.. అమ్మకాలతో జీవనోపాధి
- నగరంలో విక్రయిస్తున్న హైదరాబాద్‌కు చెందిన యువకులు



చిన్న సైజ్ డోలక్‌లు తయారు చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన యువకులు


చిన్న ఢమరుకం

ఏయూక్యాంపస్: కూటి కోసం కోటి విద్యలు అన్న సామెతను నిజం చేస్తున్నారు ఈ యువ కార్మికులు. హైదరాబాద్ నుంచి పొట్టకూటి కోసం వచ్చిన పది మంది యువకులు చిన్నపాటి డోలక్‌లు, ఢమరుకాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటిని స్వయంగా వారే ఇక్కడ తయారు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. ఉదయాన్నే 8 గంటలకు వీరు పని ప్రారంభిస్తున్నారు. ముందుగా సిలిండ్రికల్ ఆకారంలో ఉండే అట్ట పెట్టెలను సైజుల వారీగా కట్‌చేసి సిద్ధంగా ఉంచుకుంటున్నారు. వీటికి రంగును పూసి చెక్కవాటిలా తయారు చేస్తున్నారు. ఇవి ఆరిన తరువాత వీటికి ప్లాస్టిక్, తోలుతో రెండు వైపులా మూసివేస్తారు. అందమైన తాళ్లను దీనికి సపోర్ట్‌గా వేస్తున్నారు. చిన్నపాటి ఢమరుకాలను సైతం వీరు తయారు చేస్తున్నారు.

సునాయాసంగా తయారీ..

డోలక్‌ను మూడు సైజుల్లో తయారు చేస్తూ రూ.150, రూ.250, రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. ఢమరుకం ఒక్కొక్కటి రూ.100 నుంచి రూ.120 వరకు అమ్ముతున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ యువకులు తమకు కావాల్సిన సరకును తయారు చేసుకుని నగరంలోని ప్రధాన కూడళ్లు, బీచ్ రోడ్డు, జన సమ్మర్దం ఉండే ప్రాంతాల్లో డోలక్‌లు, ఢమరుకాలు విక్రయిస్తున్నారు. కేవలం నాలుగైదు గంటల సమయం కష్టపడి వీరు యాభై వరకు డోలక్‌లను ఎంతో సునాయాసంగా తయారు చేస్తున్నారు. వీరు బయట ఉండేందుకు డబ్బులు లేక పాండురంగపురంలోని ఒక ఖాళీ స్థలంలో ఉంటున్నారు. రాత్రి వేళ సరుకు పోతుందనే భయంతో వారు ఇక్కడే నిద్రిస్తున్నారు. నెలాఖరు వరకు వీటిని తయారు చేసి నగరంలో విక్రయిస్తామని, తరువాత తిరిగి తాము హైదరాబాద్‌కు వెళ్లిపోతామని తయారీదారుడు మహమ్మద్ తెలిపారు.

అగమ్యగోచరంగా రోజ్ పార్కు పరిస్థితి..!


ముడసర్లోవ రోజ్ పార్కు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ముడసర్లోవ పార్కులో భాగమైన రోజ్ పార్కు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది వరకు వనభోజనాలు, కుల సంఘాలు, రాజకీయ పార్టీల సమావేశాలకు అనుకూలంగా ఉండే ఈ పార్కు నేడు వాటన్నింటికీ దూరమైంది. గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం కోసం జీవీఎంసీ అధికారులు ఈ పార్కులో పలుచోట్ల నిర్మాణాలు, గుర్రాలపై స్వారీ నేర్చుకోవడానికి వెడల్పయిన రింగులు నిర్మించారు. ఇప్పుడు దాని ఏర్పాటుకు బ్రేక్ పడింది. ఇటీవల జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు గుర్రాల పార్కు అవసరం లేదని తేల్చేశారు. దీంతో ఇక్కడ నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. ఇంతవరకు ఖర్చు చేసిన రూ.కోట్లు నిధులు వృథా అయ్యాయి. ముందుచూపు లేకుండా అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల సుమారు 3 ఎకరాల ప్రభుత్వ స్థలం ఎందుకూ పనికిరానిదిగా మిగిలిపోయింది. ప్రస్తుతం ఈ పార్కులో పిల్లలు ఆటలాడుకోవడానికి కూడా వీలులేని పరిస్థితి. గుర్రాల పార్కు లేదు సరికదా.. గతంలో ఉన్న పచ్చదనం, ఖాళీ స్థలం లేకుండా పోయిందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుబజార్‌లో చిల్లర నాణేల పంపిణీ

సీతమ్మధార: వినియోగదారులకు, వర్తకులకు చిల్లర నాణేలు కొరత లేకుండా సీతమ్మధార రైతుబజారులో కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. రైతులకు, వినియోగదారులకు రూ.3.50 లక్షల విలువ గల రూ.1 నుంచి రూ.20ల వరకూ గల అన్ని చిల్లర నాణేలు, నోట్లు అందజేశారు. బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.శ్యామ్ కిషోర్, మేనేజర్ కె.విశ్వనాథం, ఇతర సిబ్బంది పాల్గొని పంపిణీ చేశారు. అనంతరం శ్యామ్ కిషోర్ మాట్లాడుతూ బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని రైతుబజార్లలో చిల్లర నాణేలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బందితోపాటు రైతుబజార్ ఈవో కొండబాబు, అటెండర్ సతీష్ పాల్గొన్నారు.